వడ్డెర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

రాంనగర్,జనవరి 30(ఆంధ్రజ్యోతి): వడ్డెర ఓబన్న, వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ గురువారం వడ్డెర బస్తీలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, వెంకటేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎల్లయ్య, యాదయ్య, శివ, కొండయ్య, రాములు, బీఆర్ఎస్ నాయకులు కె.సురేందర్, బాబూరావు, చిట్టి, కిషోర్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు

● జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ఏకరువు పెట్టిన కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని ప్రజా సమస్యలపై డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తారు. డివిజన్‌లోని సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏడాది కాలంగా డివిజన్‌లోని ఏ ఒక్క కాలనీ, బస్తీ, ప్రధాన రోడ్లపై స్ట్రీట్‌లైట్లు వెలగడంలేదని, ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదన్నారు. కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన రెండో రోజే స్ట్రీట్‌లైట్ల బల్బులు కాలిపోతున్నాయని కౌన్సిల్‌లో ప్రస్తావించారు. కొత్త పోల్స్ ఏర్పాటు చేయడంలేదని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. డివిజన్‌లో పారిశుధ్య సమస్య కూడా తీవ్రంగా ఉందని, ఏ రోడ్డులోనూ పరిశుభ్రత పాటించడంలేదని కౌన్సిల్‌లో ప్రస్తావించానని కార్పొరేటర్ పావని తెలిపారు. అదే విధంగా డివిజన్‌లోని పార్కులను సుందరీకరించాలనే అంశాన్ని కూడా ప్రస్తావించగా నెలరోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి హామీ ఇచ్చారని ఆమె వివరించారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య


వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితులు బాగా లేక, చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన ఓ వ్యక్తి ఆఫీసు కార్యాలయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం కొంపల్లి పురపాలకసంఘంలోని శ్రీ రెసిడెన్సీ ఫ్లాట్ నంబరు 502లో నివసిస్తున్న ముత్యాల వేణుగోపాల్‌రెడ్డి(39) బిల్డర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక కొంతమంది వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక మనోవేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 29న సాయంత్రం గుండ్లపోచంపల్లిలోని ఏజీ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్‌లో తాను చేసిన అప్పులు తీర్చలేక చనిపోతున్నట్లు రాసి ఉంది. మృతుడి తండ్రి యేసిరెడ్డి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణ,దేశభక్తికి సరస్వతీ శిశుమందిరాలు ప్రతీకలు

గోల్నాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసరస్వతీ శిశుమందిరాల్లో చదువుకుంటే చిన్ననాటి నుంచే మంచి విద్య అందడంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. గురువారం గోల్నాక డివిజన్ నింబోలిఅడ్డలోని సరస్వతీ శిశుమందిర్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ, నేటి సమాజానికి సరస్వతీ శిశుమందిర్ లాంటి విద్యా వ్యవస్థ ఎంతో అవసరమన్నారు. సరస్వతీ శిశుమందిర్‌లో క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు దేశభక్తి పెంపొందుతుందని, ఇలాంటి విద్య వలన భవిష్యత్‌లో వారు దేశాభ్యున్నతిలో భాగస్వాములు కావడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మూల రవీందర్‌గౌడ్, సూదగాని శ్రీధర్‌గౌడ్, కేసరి నర్సింగ్‌రావుయాదవ్, మరికంటి కృష్ణంరాజు, ఆర్.వి.ఎల్.రమేష్, కర్రీ రవీందర్, రాము, అనిల్,నిరంజన్,ప్రకాష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి పాఠశాల కార్యదర్శి నరేంద్ర, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి


జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం బాపూజీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసినా నివాళులర్పించిన ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, గోవింద్, చారి


నగరంలోని బాపుఘాట్ వద్ద గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్


ముషీరాబాద్‌లో నివాళులర్పించిన టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కె.శ్రీనివాస్, నర్సింహారావు


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మ, బీఆర్ఎస్ నాయకులు


నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో నర్సింహబస్తీలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి తదితరులు

బాపూనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి: బీజేపీ

అంబర్‌పేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లోని డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని డివిజన్ బీజేపీ నేతలు అధికారులను కోరారు. బస్తీవాసుల ఫిర్యాదు మేరకు గురువారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు టి.నరేష్‌గౌడ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు నాగభూషణం చారి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు డ్రైనేజీ పొంగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. బాపూనగర్‌లో 15 రోజులుగా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జలమండలి అధికారులు వెంటనే పైప్‌లైన్ పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ వెంకటస్వామిగౌడ్ నాయకులు రమేష్‌కుమార్, అయోధ్య రాములు, వేణు ముదిరాజ్, భాస్కర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులకు మించి అంతస్తుల నిర్మాణం

● నింబోలిఅడ్డా, శాంతినగర్‌లలో రెండు అక్రమ నిర్మాణాల కూల్చివేత

● అనుమతులు లేకపోతే చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక


నింబోలిఅడ్డాలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది


శాంతినగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేతలు

బర్కత్‌పుర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డలో అక్రమ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. నింబోలిఅడ్డాలో దశరథ్ యాదవ్ అనే వ్యక్తి 127 గజాల స్థలంలో నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. జీ ప్లస్-1కు మాత్రమే జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకున్న ఆయన ఏకంగా నాలుగు అంతస్తులు నిర్మిస్తున్నాడు. జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసినా యజమాని పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగించాడు. దీంతో గురువారం జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి దివాకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యలు భారీ పోలీసు బందోబస్తుతో అక్రమంగా నిర్మించిన రెండు అంతస్తులన కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేశామని, అయినప్పటికీ యాజమాన్యం స్పందికపోతే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామని హెచ్చరించారు.

గోల్నాక శాంతినగర్‌లో మరొకటి..

గోల్నాక డివిజన్‌లోని శాంతినగర్‌లో జీవన్ అనే వ్యక్తి రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. దీనిపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినా యజమాని పట్టించుకోలేదు. దీంతో సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యలు పోలీసు బందోబస్తు నడుమ తమ సిబ్బందితో కలిసి అనుమతి లేకుండా నిర్మించిన రెండు ఫ్లోర్లను కూల్చివేశారు.

మోదీ ప్రభుత్వ కార్పొరేట్, ఫాసిస్టు విధానాలపై ఉద్యమించాలి

● ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రదీప్

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మోదీ ప్రభుత్వ కార్పొరేట్, ఫాసిస్టు విధానాలపై కార్మికులు ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బి.ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్సభవన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఐఎఫ్‌టీయూల విలీన సభ అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు, కార్మికులు తిరుగుబాటు చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఐఎఫ్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నూతక కార్యవర్గాన్ని ఈ సమావేశంలో ఎన్నుకున్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులుగా అరుణ, ప్రధాన కార్యదర్శి అనురాధ, ఉపాధ్యక్షులుగా శివబాబు, మల్లయ్య, రాంరెడ్డి, మంగ్లి, సహాయ కార్యదర్శులుగా యాదమ్మ, పద్మ, మణెమ్మ, శ్రీశైలం, కోశాధికారిగా కుమార్ తోపాటు 16 మంది నూతన సభ్యులను ఎన్నుకున్నారు.


చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

6,7 తేదీల్లో ఢిల్లీలో ఓబీసీ జాతీయ సదస్సులు

బర్కత్‌పుర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టడం, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయడం వంటి డిమాండ్లతో ఫిబ్రవరి 6, 7 తేదీలలో ఢిల్లీలో ఓబీసీ జాతీయ సదస్సులు నిర్వహించనున్నట్టు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి చెరుకుల సుగుణపతి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీ విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. రూ. 2 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని, హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల నియామకాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని ఆయన కోరారు.

బీసీ పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలన్నారు. ఢిల్లీలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సుల్లో అన్ని పార్టీల నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేత లు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, అనంతయ్య, జయంతిగౌడ్,సుధాకర్, మణికంఠ,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నేతలు

ప్రజలను మోసం చేస్తున్న సీఎం: ఎమ్మెల్యే ముఠా

ముషీరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 400 రోజులు పూర్తి అయినా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నేటికీ అమలు చేయలేదని ఎమ్మెల్యే ముఠాగోపాల్ విమర్శించారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు టెంట్ హౌస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ బాపూజీనగర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి తాను ఇచ్చినహామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్, పార్టీ సీనియర్ నాయకుడు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు: ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులైన సందర్భంగా ఇచ్చిన 420 హామీలను విస్మరించడంపై గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. హామీలను నెరవేర్చకపోవడంతో ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, మాధవ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వ విఫలం: బీఆర్ఎస్

చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ఎం. నాగేశ్‌ముదిరాజ్ ఆరోపించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 420 రోజులు అయ్యిందని, ప్రభుత్వ నేతలు ఇచ్చిన 420 హామీలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ మేరకు బుధవారం గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నాగేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలను అమలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. నాగసాయి, శ్రీహరి, సురేష్, శ్రీనివాస్, కానయ్య తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న స్విమ్మర్ క్వీని విక్టోరియా

బర్కత్‌పురాలో రోడ్డు ప్రమాదం

● మానవత్వం చాటిన స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా

బర్కత్‌పుర,జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా స్వయంగా ఆస్పత్రికి తరలించి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. బర్కత్‌పురా హౌసింగ్ బోర్డు పార్కు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న క్వీని విక్టోరియా ఈ ప్రమాదాన్ని చూసి వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. తీవ్ర గాయాలతో రక్త స్రావం అవుతున్న మహిళను చూసి చలించిన క్వీని విక్టోరియా గాయపడిన మహిళను స్వయంగా దగ్గర ఉండి సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అంతే కాదు డాక్టర్‌తో మాట్లాడి బాధితురాలికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మానవత్వం చాటుకున్న స్విమ్మర్‌ను పలువురు అభినందించారు.

పీడీఎస్‌యూ 'గ్రేటర్' నూతన కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్షుడిగా సోనబోయిన రాకేష్

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని గురువారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోనబోయిన రాకేష్, ప్రధాన కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా నాగరాజ్, నవీన్, సహాయ కార్యదర్శులుగా సాయిప్రసాద్, దీక్షిత, కోశాధికారిగా భీమ్‌సేన్‌తో పాటు 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. జార్జిరెడ్డి ఆశయ సాధన కోసం తమ కమిటీ పని చేస్తుందని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ బదిలీ

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహినుద్దీన్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం జీహెచ్ఎంసీ కమి షనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి డీఎంసీగా అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మా రుతీ దివాకర్‌ను నియమించారు. దీంతో ఖాదర్ మోహినుద్దీన్ తన బాధ్యతలను గురువారం సాయంత్రం మారుతీదివాకర్‌కు అప్పగించి రిలీవ్ అయ్యారు.


కేవీ కేశవులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, వాడపల్లి మాధవ్, జైసింహ తదితరులు

కేవీ కేశవులు సేవల చిరస్మరణీయం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడిగా, మంత్రిగా కేవీ కేశవులు ప్రజలకు, దేశానికి అందించిన సేవలు మరువలేనివని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. తెలంగాణ మేర కుల వృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాడపల్లి మాధవ్ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్ హాల్‌లో కేవీ కేశవులు 6వ వర్ధంతగి సభ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్‌లు నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ఎం.నాగేష్ ముదిరాజ్, పార్టీ యువజన నాయకుడు ముఠా జైసింహ హాజరై కేవీ కేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కేశవులు తనదైన పాత్ర పోషించారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా ఆయన ప్రజలకు ఎన్నో సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో మేర సంఘం రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మీనారాయణ, కొత్తపల్లి వినోద్‌కుమార్, కర్నె శ్రీనివాస్, కవిత, శ్రీధర్, రమేష్, అఖిల్, అనిల్, నర్సింగ్‌రావు, రాజ్‌గోపాల్, రామ్మూర్తి, శ్రీనివాస్, సంతోష్, సతీష్, శ్యామ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మందులు వాడితే కుష్ఠు వ్యాధి నివారణ

● వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో మందులు వాడితే కుష్ఠు వ్యాధిని నివారించవచ్చని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాక్టీరియా వల్ల కుష్ఠు వ్యాధి వస్తుందన్నారు. చర్మంపై మార్పులు వస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని ఫిబ్రవరి 13వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలందించాలి

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) :పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించే తత్వాన్ని న్యాయ విద్యనభ్యసించే విద్యార్థులు అలవర్చుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ సూచించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ అంబేద్కర్ కళాశాల ఆవరణలో ఉచిత న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ న్యాయ విద్యకు నేడు ఆదరణ, గుర్తింపు ఉందన్నారు. న్యాయ విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ చట్టాలు, సెక్షన్లపై అవగాహనను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొని న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



బీజేపీ నేత సురేష్ యాదవ్‌కు నివాళి

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కోత్మర్ సురేష్ యాదవ్ దశదిన కర్మ గురువారం అంబర్‌పేట ఛే నెంబర్‌లోని మహారాణాప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరై సురేష్ యాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, నాయకులు వనం రమేష్, సి.వినోద్ యాదవ్, చుక్కా జగన్, కె.రాంచందర్‌గుప్తా, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు బొర్లకుంట దీపక్‌కుమార్ తదితరులు. చిత్రంలోసురేష్‌యాదవ్ తనయుడు బీజేవైఎం సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ యాదవ్ ఉన్నారు. - (గోల్నాక, ఆంధ్రజ్యోతి)

పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న దివ్యాంగులు

చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ బాలలు ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగ బాలలకు క్యారమ్స్, చెస్, డ్రాయింగ్, మెహందీ పోటీలను నిర్వహించారు. నగరంలోని దివ్యాంగ పాఠశాలలకు చెందిన చిన్నారులు 130 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ ఇన్‌చార్జి జయశ్రీ నైతిక విలువలు, పాజిటివ్ థింకింగ్, కేరక్టర్ బిల్డింగ్ గురించి బోధించారు. స్వీకార్ స్పెషల్ స్కూల్ వారు బ్రహ్మకుమారి సంస్థకు ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీకావ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైల్లో నగదు, సెల్‌ఫోన్ చోరీ

బర్కత్‌పుర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణికుడి జేబులోని నగదు, సెల్‌ఫోన్‌ను దొంగలు అపహరించుకుపోయారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన చంద్రశేఖర్ (46) వ్యవసాయదారుడు. కాచిగూడకు వచ్చేందుకు రాయచూర్‌లో బుధవారం సాయంత్రం రాయచూర్ డేమో ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. మార్గం మధ్యలో మహబూబ్‌నగర్ వద్ద నిద్ర నుంచి లేచి చూసుకోగా జేబులో పెట్టుకున్న రూ. 53 వేల నగదు, సెల్‌ఫోన్ కనిపించలేదు. చోరీ జరిగిందని గ్రహించిన అతను గురు వారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నల్లకుంట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

● పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే సహించం: ఎమ్మెల్యే కాలేరు


రత్నానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట,జనవరి 30(ఆంధ్ర జ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాలలో లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం ఆయన డివిజన్‌లోని రత్నానగర్‌లో రూ. 44 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బస్తీలో పాద యాత్ర చేస్తూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాప్రతినిధిగా నిరంతరం పాదయాత్రలు చేస్తూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి సత్వర పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తున్నామన్నారు. అయితే జీహెచ్ఎంసీ అధికారులు శానిటేషన్‌పై సరైన దృష్టి సారించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులు, స్వీపర్లు డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, ఈ విషయంలో ఏ మాత్రం ఆలసత్వం వహించిన సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో రత్నానగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు ఎం.బి.కిశోర్‌కుమార్, రాముయాదవ్, పి.నర్సింగ్‌రావు, వీరయ్యగౌడ్, పాదం వెంకటేష్, నల్లకుంట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌జోషి, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జి.శంకర్, మూర్తి, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.